25 ఏండ్లు పునర్విభజన వద్దు

- కేంద్రప్రభుత్వానికి దక్షిణాది రాష్ట్రాల డిమాండ్
- జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ సరికాదు
- కుటుంబ నియంత్రణ సమర్థంగా అమలు చేసిన రాష్ట్రాలను శిక్షించరాదు
- డీలిమిటేషన్‌పై జేఏసీ ఏకగ్రీవ తీర్మానం

డీఎంకే సారథ్యంలో నిర్వహించిన జేఏసీ సమావేశానికి హాజరైన కేటీఆర్, డీకే శివకుమార్, సీఎం పినరయి విజయన్, సీఎం స్టాలిన్

చెన్నై, మార్చి 22: జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజనను దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. 1971 నాటి జనాభా లెక్కల ప్రకారం ఏర్పడిన పార్లమెంటరీ నియోజకవర్గాలను కేంద్రం ఇప్పటివరకు స్తంభింపచేసిందని, దీన్నే మరో 25 సంవత్సరాల పాటు పొడిగించాలని శనివారం చెన్నైలో డీఎంకే సారథ్యంలో నిర్వహించిన జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) సమావేశం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. తమ డిమాండ్లను తెలియచేస్తూ ప్రధాని నరేంద్ర మోదీకి ప్రస్తుత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలలోనే ఎంపీలు ఒక సంయుక్త వినతి పత్రాన్ని అందచేయాలని కూడా జేఏసీ నిర్ణయించింది. ఈ సమావేశానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, పంజాబ్ సీఎం భగవంత్‌సింగ్ మాన్, కర్ణాటక ఉపముఖ్య మంత్రి డీకే శివకుమార్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు వివిధ పార్టీల ముఖ్యనేతలు హాజరయ్యారు.

అన్ని పార్టీలతో చర్చించాకే..

1971 జనాభా లెక్కల ప్రకారం జరిగిన పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనను మరో 25 సంవత్సరాల పాటు కొనసాగించాలని జేఏసీ కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. ప్రజాస్వామ్య సిద్ధాంతాలను, స్వరూపాన్ని మెరుగుపచేందుకు చేపట్టే ఎటువంటి డీలిమిటేషన్ ప్రక్రియనైనా పారదర్శకంగా, అన్ని రాష్ట్రాలలోని రాజకీయ పార్టీలు, రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతర భాగస్వాములతో చర్చించి, వారి అభిప్రాయాలు తీసుకున్న తర్వాతే చేపట్టాలని సమావేశంలో ఆమోదించిన తీర్మానంలో జేఏసీ కేంద్రాన్ని కోరింది. జనాభా నియంత్రణ కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయడంతో ఆ తర్వాత జనాభా తగ్గిన రాష్ట్రాలను శిక్షించకూడదని, ఇందుకోసం కేంద్రం అవసరమైన రాజ్యాంగ సవరణలు చేయాలని విజ్ఞప్తిచేసింది. తమ సూచనలకు విరుద్ధంగా డీలిమిటేషన్ ప్రక్రియను చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తే దాన్ని తిప్పికొట్టేందుకు సమావేశానికి హాజరైన రాష్ట్రాలకు చెందిన ఎంపీలతో కూడిన కోర్ కమిటీ పార్లమెంటరీ వ్యూహాలను సమన్వయం చేసుకుంటుందని తీర్మానం తెలిపింది. ప్రస్తుత పార్లమెంటరీ సమావేశాలలో కోర్ కమిటీకి చెందిన ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీకి ఒక వినతిపత్రాన్ని సమర్పిస్తారని తీర్మానంలో పేర్కొన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న వివిధ రాష్ట్రాలకు చెందిన రాజకీయ పార్టీలు తమ రాష్ట్ర అసెంబ్లీలలో అవసరమైన తీర్మానాలను ఆమోదించడానికి చర్యలు చేపట్టాలని, ఆమోదించిన తీర్మానాలను కేంద్ర ప్రభుత్వానికి పంపాలని జేఏసీ తన తీర్మానంలో పేర్కొంది.

శనివారం చెన్నైలో 'డీలిమిటేషన్'పై జరిగిన సమావేశంలో సీఎం స్టాలిన్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, కేఆర్ సురేశ్‌రెడ్డి, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

ప్రజాస్వామ్యం నియంతృత్వంగా మారొద్దు

- దశాబ్దాలుగా దక్షిణాదిపై కేంద్రం వివక్ష
- డీలిమిటేషన్‌తో దక్షిణాదికి ప్రమాదం
- పార్లమెంట్ స్థానాలను యథాతథంగా ఉంచి ఎమ్మెల్యే సీట్ల సంఖ్య పెంచాలి
- దక్షిణాదికి శిక్ష కాదు.. ప్రోత్సాహం కావాలి
- ఆయా రాష్ట్రాల ఆర్థిక ప్రగతి, పరిపాలన, అభివృద్ధి ఆధారంగా డీలిమిటేషన్ చేయాలి
- దక్షిణాది రాష్ట్రాలు హక్కుల కోసం ఇప్పుడు పోరాడకపోతే చరిత్ర మనల్ని క్షమించదు
- దక్షిణాది రాష్ట్రాల సమావేశంలో కేటీఆర్

> దక్షిణాది రాష్ట్రాలు దేశ జీడీపీలో 36 శాతం సహకారం అందిస్తున్నా, కేవలం 19 శాతం జనాభానే కలిగి ఉన్నాయి. అందువల్ల వీటికి పార్లమెంట్‌లో 36 శాతం ప్రాతినిధ్యం ఇవ్వాలి. జనాభాతోపాటు ఆర్థిక, పరిపాలన అభివృద్ధిని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. కేంద్ర ప్రభుత్వం దేశాన్ని వేగంగా ముందుకు తీసుకెళ్లే పనులు చేయాలి. రాష్ట్రాల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలు మానుకోవాలి.
> -కేటీఆర్

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): ఆదర్శవంతమైన సమాఖ్య రాష్ట్రాల దేశంలో ఒక ప్రాంతం మరో ప్రాంతంపై ఆధిపత్యం చెలాయించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టంచేశారు. 'మనం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నం. ప్రజాస్వామ్యం మందబలం ఆధారంగా నడవకూడదు. ఇది నియంతృత్వానికి దారితీయకూడదు' అని పేర్కొన్నారు. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన దక్షిణాది రాష్ట్రాల భవిష్యత్తును నాశనం చేస్తుందని హెచ్చరించారు. ఇది పార్లమెంటులో ప్రాతినిధ్యానికి సంబంధించిన అంశం మాత్రమే కాదని, నిధుల కేంద్రీకరణతోపాటు ఆర్థిక నియంతృత్వానికి దారితీస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. భారతదేశం ప్రజాస్వామిక దేశమైనా, భిన్న అస్తిత్వాలు, సంస్కృతులతో కూడిన సమాఖ్య రాష్ట్రమన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. దక్షిణాది రాష్ట్రాలు దశాబ్దాలుగా కేంద్రం నుంచి వివక్షను ఎదుర్కొంటున్నాయని, ప్రస్తుత డీలిమిటేషన్ ప్రతిపాదనలతో పార్లమెంట్ ప్రాతినిధ్యంతోపాటు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతుందని హెచ్చరించారు. చెన్నైలో శనివారం జరిగిన దక్షిణాది రాష్ట్రాల పార్టీల నేతలు, ముఖ్యమంత్రుల సమావేశంలో పాల్గొన్న కేటీఆర్.. తన ప్రసంగం అనంతరం మీడియాతోనూ మాట్లాడారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు జరిగే నష్టాన్ని వివరించారు. దక్షిణాది ప్రయోజనాల కోసం చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ విధానాలను బీఆర్ఎస్ తరపున ప్రతిపాదించారు.

ఈ విధానాలతో రాష్ట్రాల మధ్య విభేదాలు

కేంద్ర ప్రభుత్వం ప్రజల ప్రాతినిధ్యాన్ని ప్రభుత్వాలతో సంబంధాలను పెంపొందించి మంచి పరిపాలన అందించాలనే ఉద్దేశంతో డీలిమిటేషన్ చేపడుతున్నట్టయితే, రాష్ట్రాల మధ్య విభేదాలు సృష్టించే ఈ విధానానికి ప్రత్యామ్నాయాలను ఆలోచించాలని కేటీఆర్ సూచించారు. బీఆర్ఎస్ తరపున కొన్ని ప్రత్యామ్నాయాలను ప్రతిపాదిస్తున్నట్టు చెప్పారు. జనాభా ఆధారంగా అసెంబ్లీలో ఎమ్మెల్యే స్థానాలను పెంచితే పరిపాలన ఫలితాలు ప్రజలకు సమర్థవంతంగా అందుతాయని, అందుకే పార్లమెంట్ స్థానాలను యథాతథంగా ఉంచి ఎమ్మెల్యే స్థానాలను పెంచాలని సూచించారు. లేదంటే, అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించడం లేదా రాష్ట్రాలు సాధించిన అభివృద్ధి ఆధారంగా సీట్ల విభజన చేయాలని కేంద్రాన్ని కోరారు.

అభివృద్ధిని పరిగణనలోకి తీసుకోవాలి

ఐదు దశాబ్దాలపాటు జనాభా ఆధారంగా సీట్ల పెంపును నిలిపివేసి, ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణలో విజయం సాధించిన తర్వాత అదే సూత్రం ఆధారంగా డీలిమిటేషన్ చేయడం అన్యాయమని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. దక్షిణాది రాష్ట్రాలు దేశ జీడీపీలో 36% సహకారం అందిస్తున్నా, కేవలం 19% జనాభా కలిగి ఉన్నాయని, అందువల్ల పార్లమెంట్‌లో 36% ప్రాతినిధ్యం ఇవ్వాలని విప్లవాత్మక సూచన చేశారు. జనాభాతోపాటు ఆర్థిక, పరిపాలన అభివృద్ధిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశం సూపర్ పవర్‌గా మారాలంటే ఈ బాధ్యత కేంద్రానిదేనని స్పష్టం చేశారు.

దక్షిణాది రాష్ట్రాలకు నష్టాలు

ప్రస్తుత డీలిమిటేషన్ విధానంతో దక్షిణాది రాష్ట్రాలకు అనేక నష్టాలు కలుగుతాయని కేటీఆర్ హెచ్చరించారు. దేశ అభివృద్ధిలో ముందున్న రాష్ట్రాలు నష్టపోతుండగా, వెనుకబడిన రాష్ట్రాలకు లాభం కలుగుతుందని విమర్శించారు. పరిపాలన, ఆర్థిక అభివృద్ధిలో దక్షిణాది రాష్ట్రాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నా, ఈ విధానంతో తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నాయని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష కొత్తేమీ కాదని, మోదీ ప్రధాని అయ్యాక ఇది మరింత పెరిగిందని ఫైరయ్యారు. ప్రస్తుత బీజేపీ సారథ్యంలోని కేంద్రం డీలిమిటేషన్ అంశాన్ని ముందుకు తెచ్చి ఈ వివక్షను తీవ్రం చేస్తున్నదని విమర్శించారు. బుల్లెట్ రైలు వంటి ప్రాజెక్టులు ఉత్తరాది రాష్ట్రాలకే పరిమితమవడం ఇందుకు ఉదాహరణగా చెప్పారు.

> పరిపాలన, ఆర్థిక అభివృద్ధిలో దక్షిణాది రాష్ట్రాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నా, జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్‌తో తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటాయి. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష కొత్తేమీ కాదు. మోదీ ప్రధాని అయ్యాక ఇది మరింత పెరిగింది. ప్రస్తుత బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ అంశాన్ని ముందుకుతెచ్చి ఈ వివక్షను మరింత తీవ్రం చేస్తున్నది. బుల్లెట్ రైలు వంటి ప్రాజెక్టులు ఉత్తరాది రాష్ట్రాలకే పరిమితమవడం ఇందుకు ఉదాహరణ.
> -కేటీఆర్

ఇది నియంతృత్వం వైపు దారితీస్తది

జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్‌తో పార్లమెంట్‌లో దక్షిణాది ప్రాతినిధ్యం తగ్గడానికే పరిమితం కాదని, ఆర్థిక నిధుల కేటాయింపుల్లో కూడా నష్టం కలుగుతుందని కేటీఆర్ ఆందోళన వ్యక్తంచేశారు. ఈ ప్రక్రియతో అధికారం కేంద్రీకృతమై, నియంతృత్వం వైపు దారితీసే అవకాశం ఉన్నదని, నాలుగైదు రాష్ట్రాలే దేశ భవిష్యత్తును నిర్దేశించే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. ఆర్థిక వనరుల కేంద్రీకరణతో దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న నిధుల కేటాయింపుల్లో అన్యాయం భవిష్యత్తులో మరింత పెరుగుతుందని ఆందోళన వ్యక్తంచేశారు.

ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం

ఆదర్శవంతమైన సమాఖ్య రాష్ట్రాల దేశంలో ఒక ప్రాంతం మరో ప్రాంతంపై ఆధిపత్యం చలాయించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని కేటీఆర్ మండిపడ్డారు. 'సమాఖ్యత కేంద్రం ఇచ్చేది కాదు.. రాష్ట్రాల హక్కు. అందుకే మా ప్రయోజనాల కోసం పోరాడుతాం' అని స్పష్టం చేశారు. ఈ సమస్య కేవలం ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల వ్యవహారం కాదని, జనాభా ఆధారంగా సీట్ల పెరుగుదల దేశ సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. 'మనమంతా భారతీయులం. అయితే, ఆయా ప్రాంతాల అస్తిత్వం, విభిన్న భాషలు, సాంస్కృతిక అస్తిత్వాలతో కూడిన సమైక్య దేశమన్న విషయాన్ని మర్చిపోకూడదు' అని పేర్కొన్నారు. వెనుకబడిన రాష్ట్రాలకు నిధులివ్వడాన్ని తాము వ్యతిరేకించడం లేదని, కానీ నిధుల కేటాయింపుల్లో వివక్షను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టంచేశారు. 1971 తర్వాత జనాభా నియంత్రణ చేపట్టిన దక్షిణాది రాష్ట్రాలు ఈ రోజు నష్టపోవడం అన్యాయమని, ఉత్తరాది రాష్ట్రాలు జనాభా నియంత్రణలో విఫలమైనందున వాటికి లబ్ధి చేకూర్చడం సరికాదని, ఇది దేశాన్ని వెనుకకు నడిపినవారికి బహుమతి ఇవ్వడమేనన్నారు.

అభివృద్ధికి ప్రోత్సాహం ఇవ్వాలి

'దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 100 సంవత్సరాలు పూర్తయ్యే 2047 నాటికి సూపర్ పవర్ కావాలంటే, అభివృద్ధి సాధించిన రాష్ట్రాలకు ప్రోత్సాహం ఇవ్వాలి. కానీ శిక్ష కాదు' అని కేటీఆర్ హితవుపలికారు. డీలిమిటేషన్ ఆర్థిక, పరిపాలన, అభివృద్ధి ఆధారంగా జరగాలని, కేవలం జనాభా ఆధారంగా మాత్రమే కాకూడదని డిమాండ్ చేశారు. 'ఈ అంశంలో జరిగే నష్టంపై మాట్లాడకపోతే చరిత్ర మనల్ని క్షమించదు' అని హెచ్చరించారు.

నియంతృత్వ నష్టాలు తెలంగాణకు తెలుసు

కేసీఆర్ ఆధ్వర్యంలో 14 ఏండ్లపాటు సాగిన తెలంగాణ ఉద్యమాన్ని గుర్తుచేస్తూ మెజారిటీ నియంతృత్వంతో కలిగే నష్టాలు తెలంగాణ ప్రజలకు బాగా తెలుసు అని కేటీఆర్ పేర్కొన్నారు. ఢిల్లీలోని మందబలాన్ని ఓ వైపు ఎదిరిస్తూనే మరోవైపు సమైక్య రాష్ట్రంలోని మెజారిటీ నాయకత్వంపై పోరాటం చేసి తెలంగాణ ఆకాంక్షలను నెరవేర్చుకోవడానికి 14 ఏండ్లు పట్టిందని చెప్పారు. తమిళనాడు ప్రజల నుంచి అస్తిత్వం, హక్కుల కోసం పోరాడే స్ఫూర్తిని తీసుకుంటామని తెలిపారు. ద్రవిడ ఉద్యమం సమైక్య దేశంలో రాష్ట్రాల హక్కుల సాధనకు దిక్సూచిగా నిలుస్తుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ ఏర్పాటు సందర్భంగా పునర్విభజన చట్టంలో ఇచ్చిన డీలిమిటేషన్ హామీని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. బీజేపీ ప్రయోజనాల కోసం తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లో డీలిమిటేషన్ చేయకపోగా, జమ్ముకశ్మీర్‌లో మాత్రం అమలు చేసిందని విమర్శించారు. 'బీజేపీ వంటి పార్టీలు ఈ సమావేశాన్ని దేశ వ్యతిరేకంగా చూపే ప్రయత్నం చేసినా మేమంతా భారతీయులం.. దేశాభివృద్ధి కోసం పని చేస్తున్నం' అని స్పష్టంచేశారు. దక్షిణాది రాష్ట్రాల పార్టీలు, నేతలతో కలిసి డీలిమిటేషన్ విధానంపై పోరాటం చేస్తామని వెల్లడించారు.

న్యాయబద్ధమైన డీలిమిటేషన్ కావాలి

- పునర్విభజనతో దక్షిణాదిలో సీట్లు భారీగా తగ్గుతాయి
- దక్షిణాది 100 సీట్లు కోల్పోతుందని తెలంగాణలో ప్రధాని మోదీనే చెప్పారు
- జేఏసీ సమావేశంలో స్టాలిన్

చెన్నై: డీలిమిటేషన్ అంశంపై రాజకీయ, న్యాయపరమైన ప్రణాళికను రూపొందించేందుకు ఓ నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని తమిళనాడు సీఎం, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ ప్రతిపాదించారు. జేఏసీ తొలి సమావేశంలో స్టాలిన్ ప్రసంగిస్తూ తదుపరి జనాభా లెక్కల ఆధారంగా రానున్న లేదా భవిష్యత్తులో నిర్వహించే నియోజకవర్గాల పునర్విభజన కొన్ని రాష్ట్రాలను తీవ్రంగా దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ సామాజిక కార్యక్రమాలు, ప్రగతిశీల సంక్షేమ పథకాల ద్వారా జనాభాను నియంత్రించిన రాష్ట్రాలు ఈ కార్యక్రమం కారణంగా పార్లమెంటరీ ప్రాతినిధ్యాన్ని గణనీయంగా కోల్పోనున్నాయని ఆయన తెలిపారు. 2023లో తెలంగాణలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రచారాన్ని ఆయన ఉటంకిస్తూ, కుల గణనను నిర్వహించి జనాభా ఆధారంగా కులాల వారీగా ప్రాతినిధ్యం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ చెబుతోందని, ఇక తదుపరి అడుగు డీలిమిటేషన్ అని అన్నారని స్టాలిన్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీ చెబుతున్నట్టు ప్రస్తుత జనాభా ప్రాతిపదికన పార్లమెంట్ నియోజకవర్గాలు మారితే దక్షిణాది రాష్ట్రాలు 100 సీట్లు కోల్పోతాయని, దక్షిణ భారత ప్రజలు దీనికి ఒప్పుకుంటారా అని ప్రధాని అడిగారని స్టాలిన్ గుర్తు చేశారు. మోదీ చేసిన ఈ వ్యాఖ్యలను బట్టి చూస్తే నియోజకవర్గాల సంఖ్య తగ్గుతుందని ప్రధాన మంత్రే స్వయంగా అంగీకరించినట్టు అవుతుందని ఆయన అన్నారు. రాష్ట్రాల హక్కులను బీజేపీ మొదటినుంచి కాలరాస్తోందని ఆరోపించారు. డీలిమిటేషన్‌పై ఏర్పడిన జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ)ని జేఏసీ ఫర్ ఫేర్ డీలిమిటేషన్‌గా మార్చాలని స్టాలిన్ ప్రతిపాదించారు.

లోక్‌సభ సీట్లు పెంచొద్దు

దక్షిణాది రాష్ట్రాల తొలి జేఏసీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి22 (నమస్తే తెలంగాణ): మరో 25 ఏళ్ల వరకు లోక్‌సభ సీట్ల సంఖ్యను పెంచవద్దని, వాజ్‌పేయీ తరహాలోనే నియోజకవర్గాల డీలిమిటేషన్ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. 1976, 2001 సంవత్సరాల్లో కూడా లోక్‌సభ సీట్లు పెంచకుండా డీలిమిటేషన్ చేశారని, ఇప్పుడు కూడా మోదీ ప్రభుత్వం లోక్‌సభ సీట్లు పెంచకుండా పునర్విభజన చేయాలని ఆయన సూచించారు. చెన్నైలో జరిగిన జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జనాభా ఆధారంగా చేపట్టే డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన రాజకీయంగా దక్షిణాదిని పరిమితం చేస్తుందని, ఇది రాజకీయ అసమానతలకు దారి తీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. డీలిమిటేషన్ ద్వారా ఉత్తరాది రాష్ట్రాలకు ప్రాధాన్యం పెరుగుతుందన్నారు.

తదుపరి సమావేశం హైదరాబాద్‌లో..

డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాల పార్టీల నేతలు, సీఎంల తదుపరి సమావేశం హైదరాబాద్‌లో ఉంటుందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వెల్లడించారు. చెన్నైలో శనివారం జరిగిన జేఏసీ తొలి సమావేశం అనంతరం ఈ విషయాన్ని ఆయన మీడియాకు తెలిపారు.

దక్షిణాది రాష్ట్రాలపై వేలాడుతున్న కత్తి

డీలిమిటేషన్‌పై పినరయి వ్యాఖ్యలు

చెన్నై: ప్రతిపాదిత లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనను రాష్ట్రాల మెడపై వేలాడుతున్న కత్తిగా కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అభివర్ణించారు. తమ జనాభాను తగ్గించుకున్న దక్షిణాది రాష్ట్రాలు ముఖ్యంగా ఈ ముప్పును ఎదుర్కొంటున్నాయని అన్నారు. జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డీలిమిటేషన్ ప్రక్రియను చేపట్టడానికి ముందు అర్థవంతమైన చర్చలు జరపాలని ఆయన కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఎటువంటి సంప్రదింపులు లేకుండా కేంద్రం హఠాత్తుగా డీలిమిటేషన్ ప్రక్రియను ముందుకు తీసుకెళుతోందని విజయన్ చెప్పారు. రాజ్యాంగ సూత్రాలు, ప్రజాస్వామిక విధానాలకు విరుద్ధంగా అల్పమైన రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్రం పనిచేస్తోందని ఆయన ఆరోపించారు.

ఇది దక్షిణాది రాష్ట్రాలపై రాజకీయ దాడి

డీలిమిటేషన్‌పై డీకే ఆందోళన

చెన్నై: జనాభా ప్రాతిపదికన జరిగే ప్రతిపాదిత డీలిమిటేషన్ వల్ల ఫెడరల్ ప్రజాస్వామ్యానికి ముప్పని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. జేఏసీ సమావేశంలో డీకే ప్రసంగిస్తూ జనాభా పెరుగుదలను నియంత్రించి, అక్షరాస్యతను మెరుగుపరిచి, మహిళలకు సాధికారత సమకూర్చిన దక్షిణాది రాష్ట్రాలపై రాజకీయ దాడిగా డీలిమిటేషన్ ప్రక్రియను అభివర్ణించారు. మన ప్రజాస్వామ్యానికి పునాదైన ఫెడరలిజం ప్రమాదంలో పడిందని ఆయన అన్నారు. జనాభా ప్రాతిపదికన నిర్వహించే డీలిమిటేషన్ వల్ల మనం శక్తిహీనులమవుతామని, ఈ దేశంలో మన మాటకు ఇక విలువ ఉండదని డీకే అన్నారు.

పంజాబ్‌కు తీవ్ర అన్యాయం: సీఎం మాన్

చెన్నై: డీలిమిటేషన్‌ను అమలు చేస్తే తమ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ అన్నారు. పార్లమెంట్‌లో ప్రస్తుతం 2.39 శాతంతో తమ రాష్ట్రం నుంచి 13 మంది లోక్‌సభ ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నారని ఆయన తెలిపారు. డీలిమిటేషన్‌లో భాగంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లోక్‌సభ స్థానాలను 850కు పెంచితే, తమ రాష్ట్రంలో మరో ఐదు సీట్లు పెరుగుతాయని అన్నారు. అయితే లోక్‌సభలో తమ ప్రాతినిధ్య శాతం 2.11 శాతానికి పడిపోతుందని చెప్పారు. కనీసం గతంలో లాగ తమ ప్రాతినిధ్యాన్ని 2.40 శాతానికే ఉంచుకోవాలన్నా పంజాబ్‌కు 21 సీట్లు ఇవ్వాలన్నారు. అయితే పంజాబ్‌లో బీజేపీ ఎలాగూ గెలవదు కాబట్టి, తమ రాష్ట్రానికి కేంద్రం సీట్లు పెంచే ప్రసక్తే ఉండదని భగవంత్ మాన్ అన్నారు. అంటే డీలిమిటేషన్‌తో పంజాబ్‌కు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

జనాభా ఒక్కటే ప్రాతిపదిక కారాదు

ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా పార్లమెంట్, అసెంబ్లీ సీట్లను నిర్ణయించడానికి జనాభా ఒక్కటే ప్రాతిపదిక కారాదని ఒడిశా మాజీ సీఎం, బిజూ జనతాదళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ అభిప్రాయపడ్డారు. ఈ ప్రక్రియను అమలు చేసే ముందు అన్ని పార్టీలతో విస్తృతంగా చర్చించాల్సిన అవసరం ఉందని అన్నారు. డీలిమిటేషన్‌పై చెన్నైలో జరిగిన జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) సమావేశంలో ఆయన వర్చువల్‌గా ప్రసంగించారు. పునర్విభజనపై వివిధ పార్టీలకు ఉన్న సందేహాలను కేంద్రం తీర్చాలని ఆయన సూచించారు. ఒక వేళ అప్పట్లో తమతో పాటు పలు దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణ చేయకపోతే భారత్‌లో జన విస్ఫోటం జరిగి ఉండేదని, తద్వారా మన అభివృద్ధి ప్రగతి పట్టాలు తప్పేదని అన్నారు. ఎన్నో ఏండ్లుగా ఒడిశా సంతానోత్పత్తిని తగ్గించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. 2026 జనాభా ప్రాతిపాదికన సీట్లను కేటాయిస్తే ఒడిశా రాష్ట్రం అటు పార్లమెంట్, ఇటు అసెంబ్లీ సీట్లను కూడా కోల్పోతుందని అన్నారు.

మాజీ గవర్నర్ నరసింహన్-విమల దంపతులకు యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ప్రతిమను అందజేస్తున్న కేటీఆర్. చిత్రంలో బీఆర్ఎస్ నేతలు

ఏ రాష్ట్రానికీ నష్టం లేకుండా చూడండి

వైసీపీ అధినేత వైఎస్ జగన్

అమరావతి: డీలిమిటేషన్ ద్వారా సీట్లు తగ్గి ఏ రాష్ట్రానికీ నష్టం జరగకుండా చూడాలని వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు. ఎంకే స్టాలిన్ నేతృత్వంలో జరిగిన జేఏసీ సమావేశానికి వైసీపీ అధినేత వైఎస్ జగన్, పార్టీ నేతలు హాజరు కాలేదు. అయితే ఆయన డీలిమిటేషన్‌కు సంబంధించి ప్రధానిని ఉద్దేశిస్తూ రాసిన లేఖను విడుదల చేశారు. 'గత 15 ఏళ్లలో దక్షిణాది రాష్ట్రాల జనాభా తగ్గింది. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరిపితే సీట్లు తగ్గుతాయన్న చర్చ దక్షిణాది రాష్ట్రాల్లో జరుగుతున్నది. అందుకే జనాభా లెక్కల ప్రకారం ఇది లేకుండా చూడండి' అని కోరారు. డీలిమిటేషన్ సమస్య దేశంలోని రాజకీయ, సామాజిక సామరస్యతను దెబ్బతీసే ప్రమాదం ఉందన్నారు.

నరసింహన్‌తో కేటీఆర్ భేటీ

చెన్నైలో తెలంగాణ మాజీ గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌ను కేటీఆర్ మర్యాదపూర్వకంగా కలిశారు. అల్వార్‌పేటలోని నరసింహన్ నివాసానికి కేటీఆర్‌తో పాటు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, కేఆర్ సురేశ్‌రెడ్డి, మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు తదితరులు వెళ్లగా నరసింహన్-విమల దంపతులు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు నరసింహన్ దంపతులకు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సన్మానించారు. యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ప్రతిమను, పండ్లను బహూకరించారు. బీఆర్ఎస్ ప్రతినిధుల బృందానికి నరసింహన్ తేనీటి విందు ఇచ్చి కొద్దిసేపు వారితో ఇష్టాగోష్టి జరిపారు.

అప్పుడే దీనిపై చర్చలెందుకు?: ఆరెస్సెస్

త్వరలో జరగనున్న పునర్విభజనపై రాష్ట్రాలు నిజంగానే ఆందోళన చెందుతున్నాయా? లేక ఏదైనా రాజకీయ అజెండాతో దీనిపై చర్చలు జరుపుతున్నాయా? అని ఆరెస్సెస్ సంయుక్త ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్ ప్రశ్నించారు. డీలిమిటేషన్‌పై చర్చకు చెన్నైలో విపక్ష నేతలు సమావేశమవడాన్ని ఆయన ప్రస్తావిస్తూ కేంద్రం ఇంకా ఆ ప్రక్రియను ప్రారంభించలేదు కనుక అనవసర చర్చలు ఆపాలని సూచించారు.

డీలిమిటేషన్‌పై అపోహలు సృష్టిస్తున్నారు

**బీజేపీ న